వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
సోమవారం, ఆగస్టు 31, 2026

# బంగారు తెలంగాణ కాదు.. బహుజన తెలంగాణ కావాలి

- ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావడమే నా లక్ష్యం
- కాంగ్రెస్‌పై పోరాడుతూనే టీఆర్ఎస్‌ను నిర్మిస్తాం
- వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ
- నిజామాబాద్‌లో ఐదు అసెంబ్లీ స్థానాలు గెలుస్తాం
- కల్వకుంట్ల కవిత

**నిజామాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** బంగారు తెలంగాణ కాదని, బహుజన తెలంగాణే తమ లక్ష్యమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావాలనే సంకల్పంతో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేశానని తెలిపారు. పార్టీ ఏర్పాటైన నాలుగు నెలల తర్వాత సొంతూరు నిజామాబాద్ గడ్డపై ప్రజలను కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. నిజామాబాద్‌లో నిర్వహించిన సభలో కవిత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం ప్రజలు ఎంతో త్యాగం చేశారని, ఉద్యమంలో సుమారు 1,600 మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కొంత అభివృద్ధి జరిగినప్పటికీ ప్రజల జీవితాల్లో ఇంకా ఆశించిన స్థాయిలో మార్పు రాలేదని వ్యాఖ్యానించారు. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపేందుకు కొత్త రాజకీయ శక్తి అవసరమని అన్నారు. తాను పదవుల కోసం పార్టీ ఏర్పాటు చేయలేదని కవిత స్పష్టం చేశారు.




ఎంపీగా, ఎమ్మెల్సీగా ప్రజలు తనను గెలిపించారని, ఇకపై కూడా ప్రజల కోసం పనిచేయాలనే ఉద్దేశంతో రాజకీయంగా ముందుకు సాగుతున్నానని తెలిపారు. "నాకు చూడని పదవులు లేవు. ఇక పదవుల అవసరం లేదు. ప్రజల కోసం పంతం పట్టి ముందుకు వస్తున్నా. మీ ధైర్యం, ఆశీర్వాదం కావాలి" అని ఆమె అన్నారు. తాను ఎలాంటి తప్పు చేయకపోయినా జైలుకు పంపించారని కవిత ఆరోపించారు. నాలుగేళ్లపాటు ఈడీ, సీబీఐ విచారణలతో ఇబ్బందులు ఎదురైనా తన ధైర్యం సడలలేదని, దారి తప్పలేదని చెప్పారు. మొదటి రోజు నుంచే తాను తప్పు చేయలేదని చెబుతున్నానన్నారు. సొంతూరుకు వచ్చిన సందర్భంగా భావోద్వేగానికి గురయ్యానని, కన్నీళ్లు వచ్చినంత మాత్రాన తాను పిరికిదాన్ని కాదని అన్నారు. కష్టకాలంలో అత్తింటి వారు తనను కన్న కూతురిలా ఆదరించారని తెలిపారు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై విమర్శలు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని కవిత విమర్శించారు. రైతు భరోసా వంటి పథకాల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్‌ను ప్రశ్నించాల్సిన బీఆర్ఎస్ నాయకులు ఎందుకు మౌనంగా ఉన్నారని ఆమె ప్రశ్నించారు. బోధన్‌లో వరదలు వచ్చిన సమయంలో ప్రజల కోసం బీఆర్ఎస్ నాయకులు ఎలాంటి పోరాటం చేశారని ప్రశ్నించారు. ప్రతిపక్షం మౌనంగా ఉంటే ప్రజలు కూడా మౌనంగా ఉండాల్సిన అవసరం లేదన్నారు. బీఆర్ఎస్ నేత వేముల ప్రశాంత్‌రెడ్డిపై కవిత తీవ్ర విమర్శలు చేశారు. తనను రాజకీయంగా దెబ్బతీయడంలో ప్రశాంత్‌రెడ్డి కీలక పాత్ర పోషించారని ఆరోపించారు. తనను ఓడించేందుకు ప్రయత్నించినా ప్రజల కోసం తాను ఇంటికే పరిమితం కాకుండా కొత్త రాజకీయ పార్టీతో ముందుకు వచ్చానని తెలిపారు.

## ఉచిత విద్య, వైద్యం

పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని కవిత తెలిపారు. అనారోగ్యం వస్తే ప్రజలు తమ ఆస్తులు అమ్ముకునే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆదాయంలో గణనీయమైన మొత్తాన్ని విద్య, వైద్య రంగాలకు కేటాయించవచ్చని ఆమె అన్నారు. యువత పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## భూమిలేని పేదలకు ఎకరం భూమి

సామాజిక న్యాయం అంటే అన్ని కులాలు, అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమేనని కవిత అన్నారు. తెలంగాణలో ఏ ఒక్క వర్గం వెనుకబడినా రాష్ట్రం సమగ్రంగా అభివృద్ధి చెందదని పేర్కొన్నారు. భూమి లేని అర్హులైన పేదలకు ఎకరం భూమి అందించేలా 'భూలక్ష్మి' పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. అగ్రవర్ణాల్లోని పేదలకు కూడా న్యాయం జరగాలని అన్నారు. నిజామాబాద్ జిల్లాలోని బీడీ కార్మికులకు పెన్షన్ వచ్చేలా గతంలో తాను కృషి చేశానని కవిత తెలిపారు. పెన్షన్ పెంపుతో పాటు కొత్త లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. బోధన్ చక్కెర ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం గతంలో తాను ప్రయత్నించినప్పటికీ అది సాధ్యం కాలేదన్నారు. సారంగపూర్‌లో చక్కెర ఫ్యాక్టరీ కోసం ఆందోళన చేస్తున్న కార్మికులకు తమ పార్టీ మద్దతు ఇస్తుందని, అవసరమైతే వారి కోసం ప్రత్యక్షంగా పోరాటం చేస్తామని తెలిపారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌పై కూడా కవిత విమర్శలు చేశారు. మాధవ్‌నగర్ బ్రిడ్జి నిర్మాణం ఏళ్లుగా పూర్తికాకపోవడంపై ప్రశ్నించారు. పసుపు బోర్డు వల్ల రైతులకు ఎంత ప్రయోజనం కలిగిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల కోసం పార్టీలు మారితే తప్పులేదని, పదవుల కోసం పార్టీలు మారే



రాజకీయాలను ప్రజలు తిరస్కరించాలని ఆమె అన్నారు.

## ఐదు స్థానాల్లో విజయం లక్ష్యం

తమ పార్టీ ఐదు కీలక అంశాలతో ముందుకు సాగుతుందని కవిత తెలిపారు. శ్రీకృష్ణుడి పాంచజన్య శంఖాన్ని స్ఫూర్తిగా తీసుకుని పార్టీ కార్యక్రమాలను రూపొందిస్తున్నామని చెప్పారు. వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లాలోని ఐదు స్థానాలను గెలుచుకోవడమే లక్ష్యమన్నారు. ప్రతి నియోజకవర్గంలో కొత్త యువ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తామని తెలిపారు. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై పోరాటం చేస్తూనే, మరోవైపు టీఆర్ఎస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తామని కవిత స్పష్టం చేశారు. మైనార్టీల హక్కుల కోసం వారి గొంతుకగా పోరాడతామని, రైతులను ఇబ్బందులకు గురిచేసేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన యాప్‌లను తొలగించాలని డిమాండ్ చేశారు. "బంగారు తెలంగాణ కాదు.. బహుజన తెలంగాణ కావాలి. ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావాలన్నదే నా సంకల్పం. ఇందూరు గడ్డ నుంచి ప్రారంభిస్తున్న ఈ రాజకీయ ప్రయాణానికి ప్రజల ఆశీర్వాదం కావాలి" అని కవిత అన్నారు.

# ముసారాంబాగ్ మూసీపై నూతన వారధి ప్రారంభం

- అంబర్‌పేట ప్రజల ఎన్నో ఏళ్ల కల సాకారం
- ప్రారంభ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్




**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అంబర్‌పేట నియోజకవర్గ ప్రజల ఎన్నో ఏళ్ల కల సాకారమైంది. ముసారాంబాగ్ వద్ద మూసీ నదిపై నిర్మించిన నూతన హై లెవల్ బ్రిడ్జిని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్



ఎమ్మెల్యే వి. నవీన్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు మౌలిక వసతులను అభివృద్ధి చేయడమే ప్రజా పాలన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. నగర అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ముసారాంబాగ్ మూసీపై నూతన వంతెన అందుబాటులోకి రావడంతో అంబర్‌పేట పరిసర ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడనుంది. ఈ వంతెనతో ఆయా ప్రాంతాల మధ్య రాకపోకలు సులభతరం కానున్నాయి. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా పురుషోత్తం రెడ్డి ఉద్యోగ విరమణ వేడుక



**మామునూరు, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మామునూరు నాలుగో బెటాలియన్‌లో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన వి.పురుషోత్తం రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా ఘనంగా సన్మానించారు. బెటాలియన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కమాండెంట్ ఎన్.వి.సత్య శ్రీనివాస్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందుతున్న పురుషోత్తం రెడ్డిని కమాండెంట్ శాలువాతో




సత్కరించి అభినందించారు. అనంతరం కమాండెంట్ మాట్లాడుతూ పురుషోత్తం రెడ్డి కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో చేరి అంచెలంచెలుగా ఎదిగి రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ స్థాయికి చేరుకున్నారని తెలిపారు. సుదీర్ఘకాలం పోలీసు శాఖలో అంకితభావంతో విధులు నిర్వహించారని, ఎలాంటి రిమార్కులు లేకుండా ఉద్యోగ విరమణ పొందడం అభినందనీయమన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం పురుషోత్తం రెడ్డి తన కుటుంబ సభ్యులతో సంతోషంగా, ఆయురారోగ్యాలతో జీవించాలని కమాండెంట్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు బాలయ్య, రాజేందర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు విజయ్, కార్తీక్, రవి, సర్వర్, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, కృష్ణ, రాంప్రసాద్‌తో పాటు అధికారులు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.